క్లుప్తంగా

సామాజిక సేవ అలవర్చుకోవాలి



బంగారుపాళెం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్

బంగారుపాళెం: విద్యార్థులు సామాజిక సేవను అలవాటు చేసుకోవాలని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వందనాత్రిపాఠి అన్నారు. ఎన్ఎస్ఎస్‌డే(జాతీయ సేవా పథకం) దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీస ర్ మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

గుడిపాల: మండలంలోని వసంతాపురం మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం వైర్ల ఆధారంగా నిలబడి ఉంది. తేలికపాటి ఈదురుగాలులు వీసినా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారుకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతులు కాలానుగుణంగా ఆధునిక పద్ధతుల్లో పంట సాగుపై అవగాహన పెంచుకుని, సాగు చేయడంతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కాణిపాకం, చినకాంపల్లె రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఎప్పటికప్పుడు సాంకేతిక వ్యవసాయం గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులు, సాగు సమాచారం, సూచనలు ఇస్తామన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొరత లేకుండా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్మశానానికి దారి వసతి కల్పించాలి

తవణంపల్లె: మండలంలోని కట్టకిందపల్లె పంచాయతీ విజయనగరం ఎస్టీ కాలనీలో శ్మశానానికి దారి వసతి కల్పించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. శ్మశాన స్థలాన్ని, దారిని సర్వే చేసి హద్దులు చూపి, ఆక్రమణ తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎస్టీలు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం వీఆర్‌ఓ నేతాజీ, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, సచివాలయ సర్వేయర్ బాబు ఎస్టీల సమక్షంలో శ్మశానాన్ని, దారిని పరిశీలించారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఎస్టీ జిల్లా సంఘం నాయకురాలు సుగుణ, సురేంద్రనాథ్, ఎస్టీలు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తవణంపల్లె: మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెల్లగుండ్లపల్లె, కె.పట్నం గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి తెల్లగుండ్లపల్లెలో మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు అధికంగా వాడాలని సూచించారు. అనంతరం పట్నం సమీపంలోని వేరుశనగ పంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఎండుతున్న వేరుశనగ పంటకు ఎకరాకు 20 గ్రాముల యూరియా నీటిలో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ ఉమా సూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం: పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించి, నాణ్యమైన దిగుబడి సాధించాలని ఏఓ చిట్టిబాబు సూచించారు. మండలంలోని తుంబపాళెం, ఈచనేరిపల్లె పంచాయతీల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వరి, మామిడి పంటలను సందర్శించారు. పశువైద్యాధికారి లీలావతి, సీఆర్పీ అంబికా గాంధీ, అధికారులు రామమూర్తి, సాధరయ్య, యుగంధర్, హేమంత్, కార్యదర్శి గౌరీశంకర్, బ్లెస్సి పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం

మాట్లాడగలిగే మనిషి అయితే నాకు వ్యాధి వచ్చిందని చెప్పగలడు.. అదే నోరులేని మూగ జీవి తన బాధను యజమానికి చెప్పుకోలేదు.. అలాగని కుదురుగా ఉండనూ లేదు. దీన్ని పాడి రైతు అప్రమత్తంగా గుర్తించి, వైద్యం చేయిస్తే ఫలితం.. లేకపోతే నష్టం. ప్రస్తుత వర్షాకాలం.. పశువులను సతమతం చేస్తోంది. పశువుల పాకల్లో అపరిశుభ్రత నెలకొని మూగ జీవులు వ్యాధుల బారిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతుల అప్రమత్తతే పశువులకు శ్రీరామ రక్ష అని వైద్యులు చెబుతున్నారు.

- జీవాల ప్రాణానికే ప్రమాదం
- జబ్బులతో పాడిపై తీవ్ర ప్రభావం
- పశుపోషకులు అప్రమత్తతే ముఖ్యం

గుడిపాలలో ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్(ఫైల్)



గొర్రెలకు నట్టల నివారణ మందును తాగిస్తున్న డాక్టర్ సాయిసుధ



గుడిపాల: పశువులకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి వుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మూగజీవ ప్రాణాలకే ముప్పు. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పశువు కదలికలను గుర్తించకుంటే ఒక్కొక్కసారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. వర్షాకాలంలో పాడిరైతులతో పాటు గొర్రెలు, మేకల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు పశువైద్యులు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని వైద్యులు చెబుతున్నారు.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులకు ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీల వరకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కూడా ఇబ్బంది పడతాయి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ గొంతువాపు మందులను వాడాల్సి ఉంది.

కలుషిత నీటితో జలగ వ్యాధి

మురుగునీరు, కాలువల్లోని కలుషిత నీరు తాగడంతో పశువులకు ఎక్కువగా జలగ వ్యాధి సోకుతుంది. ముఖ్యంగా దూడలు, గొర్రెలు, మేకలు తదితర జీవాలకు వస్తుంది. ఈ వ్యాధికి గురైనప్పుడు మేత తినడానికి పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీమీటర్ల నియోజిడ్ ప్లస్‌ను వాడాలి.

నట్టల వ్యాధి

వర్షాకాలంలో పశువులు పచ్చి మేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. ఎక్కువ గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. నట్టల వ్యాధితో జీవాల ఎదుగుదల సక్రమంగా ఉండదు. జీవాలు తిన్న ఆహారమంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు చేయించాలి.

చిటుకు వ్యాధికి ఇటాస్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా చిటుకు వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులు తీవ్ర జ్వరంతో ఇబ్బంది పడుతుంటాయి. ఈ వ్యాధి కట్టడికి ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. పశుపోషకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. పశువు కదలికలను గమనిస్తూ ఉండాలి.

గొంతువాపు వ్యాధి ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు ప్రాణాంతకం. ఈ వ్యాధి బారినపడిన పశువుల కంటినుంచి బొంగ వస్తుంది. శ్వాస పీల్చడానికి చాలా ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి వ్యాప్తి చెందకుండా ఈ పశువులను మందనుంచి వేరు చేయాలి. వ్యాధి నియంత్రణకు హెచ్ఎస్ టీకాలు వేయించాలి.

పశుసంపద వివరాలు		
పశువులు	:	17,149
గొర్రెలు	:	7500
మేకలు	:	2885

పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి



అనారోగ్యానికి గురైన పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి. పశువుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఏ మాత్రం తేడా ఉన్నా వెంటనే పశువైద్యులను సంప్రదించాలి. గొంతువాపు, చిటుకు తదితర వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశుసంరక్షణపై ఎలాంటి సందేహాలున్నా పడి రైతులు పశువైద్య కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలి. - సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

నేడు భగవద్గీత పుస్తకాల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులకు, ప్రజలకు బుధవారం ఉదయం 10 గంటలకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు బీజేపీ చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. జనసంఘ్ వ్యవస్థాపకులు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

త్వరలోనే కట్టమంచి చెరువు సుందరీకరణ

చిత్తూరు అర్బన్: నగరంలోని కట్టమంచి చెరువును త్వరలో సుందరీకరిస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీతో కలిసి కట్టమంచి చెరువును పరిశీలించారు. ఇక్కడి చెరువులో పూడిక తీయడానికి భూమి పూజ చేశారు. చెరువుకట్ట బలోపేతం చేయడం, సుందరీకరణ పనులపై చర్చించారు. కాగా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డ చిత్తూరు వాసులు నగర అభివృద్ధికి సాయం అందించాలని కలెక్టర్ పిలుపునివ్వగా.. టీడీపీ నేత చంద్రప్రకాష్ రూ.5 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, నీటిపారులశాఖ ఎస్ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు దొరబాబు, రాజేష్‌కుమార్‌రెడ్డి, రాజన్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మహిళ ఆత్మహత్య



లక్ష్మీదేవి మృతదేహం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్‌లో విషం తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన లక్ష్మీదేవి (55) కుటుంబ కలహాలతో ఇలా చేసుకున్నట్లు రైల్వేఎస్ఐ ప్రవీన్‌కుమార్ తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. బాలికలకు కల్పిస్తున్న వసతుల గురించి సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, హాస్టల్ వార్డెన్ గీతను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి బాలికలను అందుతున్న రేషన్ వివరాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా అని తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి హాస్టల్ సిబ్బందికి సూచనలు చేశారు. అంతకు ముందు గ్రీవెన్స్ సెల్‌లో బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రాలపురం సమీపంలో నిర్వహిస్తున్న కంకర పరిశ్రమను జేసీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, సర్వేయర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతిహోమం



హోమపూజలు చేస్తున్న వేద పండితులు

కాణిపాకం: స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో మంగళవారం ప్రాయశ్చిత్త శాంతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, కలశపూజ, ప్రాయశ్చిత్త హో మం, మహా పూర్ణాహుతి, సంప్రోక్షణ, వివిధ పూజ లు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేమురళీమోహన్, ఈఓ గురుప్రసాద్ పాల్గొన్నారు.

పడగొట్టారు సరే.. కట్టేదెవరు..?



కొంగారెడ్డిపల్లెలో కూల్చేసిన కాలువ వ్యర్థాలతో ఉన్న రోడ్డు



కొంగారెడ్డిపల్లెలో ఆస్పత్రికి దారి లేక, కాలువను నిర్మిస్తున్న నిర్వాహకులు

మునిసిపల్ అధికారుల నిర్వాకం

చిత్తూరు అర్బన్: మున్సిపల్ అధికారుల నిర్వాకం చూసిన ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. రెండు నెలల క్రితం చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో కాలువల్లో ఉన్న పూడికలు తీయాలని ఉన్న కాలువలను కొట్టేశారు. పూడికలు తీయడానికి పెద్ద కాలువలు, ఆక్రమణలు తొలగించాల్సిందే. దీన్ని ఎవరూ కూ డా తప్పు పట్టడంలేదు. కానీ చిన్నపాటి కచ్చా కాలువలను జేసీబీలతో కూల్చేసిన అధికారులు.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు తయారైంది. పొన్నియమ్మగుడి ప్రాంతంలో చిన్నపాటి కాలువలను పడగొట్టిన యంత్రాగం, వాటి స్థానంలో కొత్త కాలువలు కట్టకుండా వదిలేశారు. అలాగే కొంగారెడ్డిపల్లె ప్రధాన రహదారిలో కూడా చిన్నపాటి కాలువలు కూల్చేసిన అధికారులు, వాటి నుంచి ఎలాంటి వ్యర్థాలు తీయకపోవడం గమనార్హం. కేవలం టీడీపీ సానుకూల వ్యక్తులను జేసీబీ పనుల పేరిట బిల్లులు ఇవ్వడానికే ఇలాంటి కక్కుర్తి పనులు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొన్నియమ్మగుడి వీధి, కొంగారెడ్డిపల్లె ప్రాంతాల్లో కొన్ని కాలువల్లో ఎలాంటి వ్యర్థాలు తీయకనే వదిలేశారు. కూల్చేసిన వ్యర్థాలతో ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొన్ని కాలువలను వాటి సమీపంలో ఉన్న భవన యజమానులే పునర్నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగిలినవాటినైనా కార్పొరేషన్ అధికారులు పునర్నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లడ్డూపై టీడీపీ రాజకీయం తగదు



మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

కాణిపాకం: పవిత్రమైన తిరుమల లడ్డూపై టీడీపీ చేస్తున్న రాజకీయం తగదని కాంగ్రెస్ నేత భాస్కర్ మండిపడ్డారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలో మంగళవారం శత క్షీరాకలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కాదని.. నయవంచన సర్కారని విమర్శించారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను మళ్లించడానికి లడ్డూను అడ్డంపెట్టుకుని టీడీపీ రాజకీయం చేస్తోందన్నారు. పచ్చమీడియా, టీడీపీ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని లడ్డూపై విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత మాల వేస్తే సరిపోదని.. లడ్డూ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. నాయకులు శివశంకర్, పరదేశి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



వాహన షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: మున్సిపాలిటీకు సంబంధించిన వాహనాల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని.. జాగ్రత్తగా చూసుకోవాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న మున్సిపల్ వాహనాల షెడ్డును ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనుల కోసం వాడుతున్న వాహనాలు, ఎన్ని పాడైపోయిని, ఉన్నాయనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఇక్కడే ఉద్యోగుల హాజరును పరిశీలించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, కార్యదర్శులు ఉన్నారు.

సేద్యానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలి

ఐరాల: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నాంపల్లెలో ఎంపీడీఓ నాగరాజు నేతృత్వంలో చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడారు. అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేదే లేదని హెచ్చరించారు.

అవగాహన అవసరం



రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ మాధవి

గుడిపాల: పంటలపై చీడపీడల నివారణపై ప్రతి రైతు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మంగళవారం బసవాపల్లె, శ్రీరంగంపల్లె పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పొలాలను సందర్శించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. పంట సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచించిన క్రిమిసంహారక మందులు సకాలంలో పిచికారీ చేసి తెగుళ్ల నివారించుకోవాలన్నారు.

పాడి పరిశ్రమను అభివృద్ధి చేద్దాం

పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఉన్న పరిస్థితుల్లో పాడి ఆవులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పాడి పరిశ్రమతోనే ప్రతి కుటుంబం ఆర్థికంగా ముందుకు వెళుతుందన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలను ప్రతి పశువుకు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీలా, సిరికల్చర్ అధికారి భువనేశ్వరి, నాయకులు చెన్నకేశవనాయుడు, మధు పాల్గొన్నారు.

జీఓ 85 ఉపసంహరించుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న శివయ్య, దేవకుమార్

ఐరాల: ప్రభుత్వం జీఓ నంబర్ 85ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శివయ్య, జిల్లా కోశాధికారి డి.దేవకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాణిపాకం పీహెచ్‌సీలో ఆరు రోజులుగా ప్రభుత్వ వైద్యులు చేస్తున్న నిరసనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళనతో పీహెచ్‌సీల్లో రోగులకు వైద్య సేవలు అందడం లేదని వాపోయారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ సర్వీస్ కోటాను కుదించడంతో పీజీ వైద్య విద్యలో ప్రభుత్వ డాక్టర్లకు అన్యాయం జరుగుతోందని, వెంటనే జీఓ 85ను రద్దు చేసి సర్వీసు కోటాను పునరుద్ధరించాలని డిమాండ్‌తో కాణిపాకం వైద్యులుతో కలిసి నిరసన తెలిపారు.

సామాజిక బాధ్యత పెంపొందించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్ : యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షమ్స్ అక్తర్ అన్నారు. మంగళవారం ఆ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవం, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీమ్‌ను భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛంద ప్రజాసేవ కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమాన్ని 1969లో ప్రవేశపెట్టారని చెప్పారు. యువతలో సామాజిక, సమాజసేవా భావాన్ని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యతో పాటు సమాజసేవను విద్యార్థులలో ప్రోత్సహించేందుకు ఈ జాతీయ సేవా పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో పాల్గొనడంతో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తన బాధ్యతలను తెలుసుకుంటారన్నారు. అనంతరం గిరింపేట వరకు ర్యాలీ చేశారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల నాయకత్వ లక్షణాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు ధర్మమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధుడికి కళార్చన







గానం..నృత్యం..పౌరాణికం పరవశమైన వేళ.. మనసు ఆనంద డోలికల్లో తేలియాడుతుంది. గాయకుల గానాలాపన.. నర్తకుల నృత్యార్చన..పౌరాణిక కళాకారుల నాటక ప్రదర్శనకు వరసిద్ధుని బ్రహ్మోత్సవం వేదికైంది. వినాయకస్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో మంగళవారం నిర్వహించిన సంగీత కచ్చేరి..పౌరాణిక నాటికలు..కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన, ప్రేక్షకులకు కనువిందు చేశాయి. అనంతరం కళాకారులను ఆలయ అధికారులు బహుమతులతో సత్కారించారు.

-కాణిపాకం







